## గోల్డ్ మెడల్ సంపాదించిన పట్టభద్రుడి ఉద్యోగాన్వేషణ?

# విశ్వమోహిని కథ

# ఓ పట్టభద్రుని కథ

ఆ రోజు డిగ్రీ రిజల్ట్సు వచ్చాయి. ఉట్టి భద్రరావ్ పట్టభద్రరావ్ అయ్యాడు. అంతేకాదు, డిగ్రీతోపాటు గోల్డ్ మెడల్ కూడా కొట్టేసాడతను. కొందరు అభివందిస్తే, అనుభవజ్ఞులు జాలిపడ్డారు అతన్ని చూసి.

పరీక్షలు పాసవడానికి పడాల్సిన అష్టకష్టాలూ అంతటితో తీరినందుకు సంతోషంగా వుంది పట్టభద్రరావ్‌కి. కాని, జీవితంలో అసలు కష్టాలు అప్పటి నుంచే ఆరంభమయ్యాయన్న సత్యం ఎరుగని అతని అమాయకత్వానికి సానుభూతి చెందారంతా.

పై చదువుల స్తోమతలేని భద్రరావ్ పట్టా చేతపుచ్చుకుని పుట్టెడు విశ్వాసంతో జనారణ్యంలో ప్రవేశించాడు ఉద్యోగాల వేటలో. కాలేజ్ లైఫ్ నుంచి కొత్తగా బయటపడ్డాడేమో, ప్రపంచపు పోకడలు బొత్తిగా తెలీదు అతనికి. పట్టా చేతిలో పడడంతో ప్రపంచానికే పట్టం కట్టించుకున్నంత ధీమాగా వుంది.

ముందుగా ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌కి వెళ్ళాడు పట్టభద్రరావ్. హనుమంతుడి తోకలా క్షణక్షణమూ పెరిగిపోతూన్న క్యూని చూస్తే భయం వేసిందతనికి. అందులో ప్రవేశిస్తే పద్మవ్యూహంలో ప్రవేశించిన అభిమన్యుడిలా బయటపడడం కుదరదేమోనన్న బెంగ కలిగింది. కదలని క్యూలో అసహనంగా కదులుతూనే వున్నాడు రోజంతా. ఆ ఆఫీసు ఆవరణలో కొందరు స్టవ్‌లు పెట్టుకుని వంట చేసుకోవడం కనిపించింది అతనికి. ఆరా తీస్తే వారం రోజుల నుంచి రిజిస్ట్రేషన్ కోసం క్యూలో నిలుచున్న



బాపతనీ, క్యూ వదిలి వెడితే మళ్ళీ వెవకపడాల్సి వస్తుందన్న భయంతో ఆ ఏర్పాటు చేసుకున్నారనీ తెలిసింది. మొదటి సారిగా గుండె ఝల్లుమంది పట్టభద్రరావ్‌కి.

ఎలాగైతేనేం వారం రోజులపాటు ఆ ఎక్స్చేంజ్ ముందు ఒంటికాలిపైన తపస్సు చేస్తేగాని అతని పేరు ఎంప్లాయ్‌మెంట్

రిజిస్టర్‌లో నమోదు కాలేదు.

ఆ తరువాత జాబ్‌కాల్ ఎన్ని రోజులకు వస్తుందో తెలుసుకుందామని ప్యూన్‌ని కదిపాడు పట్టభద్రరావ్. ఓసారి అతని వంక ఎగాదిగా చూసి, "కాలేజ్ నుంచి ఈ మధ్యే బయటపడ్డావా బాబూ?" అనడిగాడు ప్యూన్.

"ఔను" అన్నాడు పట్టభద్రరావ్ హుషారుగా కాలరెగరేస్తూ.

"కాలర్ దించెయ్ నాయనా! రెండుసార్లు మా ఆఫీసు చుట్టూ తిరిగావంటే నీ చొక్కాలకు కాలర్ ఎలాగూ మిగలదు. ఈ అలవాటు ఇప్పుడే మాన్పుకోకపోతే అప్పుడు ఇబ్బందవుతుంది మరి" అన్నాడు ప్యూన్.

"అదేం?" అనడిగాడు పట్టభద్రరావ్ బిత్తరపోతూ.

"అదంతేలే" "ఇంతకూ నాకు కాల్ ఎన్నాళ్ళకొస్తుందో చెప్పనేలేదు నువ్వు" అన్నాడు పట్టభద్రరావ్.

"చెప్పానుగా, మా ఆఫీసు చుట్టు తిరిగి తిరిగి నీ కాళ్ళన్నా అరిగిపోవాలిగాని, కాల్ మాత్రం రాదు లేవయ్యా" అంటూ తేల్చేశాడు ప్యూన్. "అదిగో, అలా చూడు" అంటూ ఓ వ్యక్తివైపు చూపించాడు.

అటువైపు చూసిన పట్టభద్రరావ్‌కి తెల్లగా పండిపోయిన పొడుగైన గడ్డాలూ, మీసాలూ వున్న వ్యక్తి కనిపించాడు.

"అరె! ఇక్కడ [illegible]లకేం పని?" అని అతను ఆశ్చర్యపోతే, ప్యూన్ నవ్వి అన్నాడు —"అతను సాధువుకాదు. నీలాగే ఉద్యోగం కోసం తన పేరు నమోదు చేయించుకున్న అమాయకుడు. ముప్పయ్యేళ్ళ క్రితం ఎమ్మే పాసవగానే ఇదే ఆఫీసులో పేరు రిజిస్టర్ చేయించుకున్నాడు. అప్పటినుంచీ రోజూ ఇక్కడికి వస్తూనే వున్నాడు — ఎప్పటికైనా కాల్ వస్తుందేమోనని. అతని కొడుక్కూడా పట్టా పుచ్చుకున్నాడు గాని ఇతనికి మాత్రం కాల్ రానే లేదింకా"

హడలిపోయాడు పట్టభద్రరావ్. అతని వాలకం అర్థమైపోయిన ప్యూన్, "చూడు నాయనా! కాల్ రావాలంటే రేటివ్వాలి" అని చెప్పాడు సూటిగా. "రేటా?" తెల్లబోయాడు పట్టభద్రరావ్.

"ఔను. నీ అర్హతలను బట్టి ఆ ఉద్యోగం నీకు వచ్చే సూచనలు ఎక్కువగా వుంటే రేటు ఎక్కువుంటుంది. నలుగురితో పాటు నారాయణా అనిపిస్తే కాస్త తక్కువుంటుంది. అయితే ఖాళీలు ఎక్కడున్నాయో నువ్వే వెతుక్కోవాల్సుంటుంది"

ఆ ఎంప్లాయ్‌మెంటోపాఖ్యానంతో బుర్ర తిరిగిపోయిన పట్టభద్రరావ్, ఉద్యోగాల వేటలో వూరంతా తిరిగేశాడు కొత్త బిచ్చగాడిలా. ఎక్కడికి వెళ్ళినా 'నో వేకెన్సీ!' బోర్డు, సినిమా థియేటర్ల ముందు 'హౌస్‌ఫుల్' బోర్డులా కనిపించింది.

అతని అవతారం చూసి జాలిపడి ఓ ఆఫీసులోని ముసలి గుమాస్తా ఒకడు 'జాబోపదేశం' చేశాడతనికి — "చూడబ్బాయ్! నీ గోల్డ్‌మెడల్‌కి జోళ్ళు కూడా రావు. ఈ రోజుల్లో ఉద్యోగానికి విద్యార్హత ఒకటే సరిపోదు. ఉత్తర — దక్షిణలు అవసరం... అలా దిక్కులు చూడకు... నేను మాట్లాడుతున్నది సిఫార్సులు, లంచాలు గురించి... అవెందుకూ అంటావా? చెబుతాను విను... వుదాహరణకు పెళ్ళిళ్ళే తీసుకో. అబ్బాయిలు

, అమ్మాయిలు ఎందరో వున్నారు. వారిలో ఎవరు ఎవర్ని చేసుకోవాలన్నది అబ్బాయిల ఛాయిస్ అయిపోయింది. ఎవరెక్కువిస్తే వారినే చేసుకుందాం అన్న రూల్ పెట్టుకుని, రేట్లు నిర్ణయించేసుకున్నారు. ఉద్యోగాలూ అంతే! విద్యార్హతలు గలవాళ్ళు వేలమీద వుంటే, ఎవర్ని ఎన్నుకోవాలన్నది ఎవరికైనా సమస్యే కదా! అందుకే ఈ అడిషనల్ క్వాలిఫికేషన్స్ — అదే, ఉత్తర దక్షిణలు. అర్థమయింది కదూ? ఇక మంచి 'తూర్పు పడమరలు' వదిలేసి నీ అన్వేషణ ఉత్తర దక్షిణల్లోనే సాగించు!''

ఆ 'జీవన సత్యాలను' జీర్ణించుకోలేకపోయిన పట్టభద్రరావ్ హతాశుడయ్యాడు. పట్టా ఎందుకు పుచ్చుకున్నానా అని వాపోయాడు.

దిగాలుగా బయటకొచ్చిన అతన్ని పలకరించాడు, ఆ ఆఫీసు బయట మిరపకాయ బజ్జీలు అమ్మేవాడు. సంగతి ఆలకించి ఫకాలున నవ్వాడు. తరువాత తన చెక్కబండిలోంచి ఓ కాగితం తీసి పట్టభద్రరావ్‌కి చూపించాడు. దాన్ని చూసిన పట్టభద్రరావ్ తెల్లబోయి నమ్మలేనట్టు చూసాడు.

అప్పుడు బజ్జీలతను ఇలా అన్నాడు. ''ఇది నా ఎమ్మే సర్టిఫికెటే గురూ! పదేళ్ళ క్రితం పొందాను. అయిదేళ్ళపాటు ఉద్యోగాలంటూ విలువైన కాలం వృథా చేసుకున్నాక గాని జ్ఞానోదయం కాలేదు. ఇదిగో, ఈ మిరపకాయ బజ్జీల కొట్టు ఆరంభించాను. ఈ అయిదేళ్ళలో నా పని బాగానే వుంది. నా కాళ్ళపైన నేను నిలవగలిగాను... మనం పట్టభద్రులం. భేషజాలు వద్దు''

అతని పలుకుల్లో హఠాత్తుగా ఏదో సందేశం స్ఫురించింది పట్టభద్రరావ్‌కి. తన గోల్డ్ మెడల్ గుర్తుకొచ్చింది. తిండి పెట్టలేని గోల్డ్ మెడల్ విలువా తెలిసొచ్చింది.

తల్లి మొత్తుకుంటున్నా వినకుండా గోల్డ్ మెడల్ని అమ్మేసాడు. ఆ వచ్చిన డబ్బుతో సెనగలు, బఠాణీలూ కొన్నాడు. ఓ స్కూల్ ముందు పెట్టుకుని అమ్మాడు. కొన్నాళ్ళకు మసాలా సెనగల్లోంచి మిరపకాయ బజ్జీలకు ఎదిగాడు. ఆ తరువాత వెనక్కి తిరిగి చూసుకునే అవసరమే లేకపోయింది అతనికి

అనతికాలంలోనే ఓ సినిమా థియేటర్ ముందు పాన్‌షాప్‌కి ప్రారంభోత్సవం చేయించాడు అతను. దాని పేరు 'పట్టభద్రరావ్ పాన్‌షాప్!' తాను పొందిన పట్టాను మాత్రం పటం కట్టించి షాపులో వేలాడదీశాడు — పదుగురికీ కనిపించేలా!

ఇదండీ, ఓ పట్టభద్రుడి వ్యధ... అతని పెట్టుదల కథాను...

*



## తెలుసు

''మా ఆవిడకి అస్సలు పుట్టుమచ్చలే లేవు తెలుసా?'' గొప్పగా చెప్పాడు ముకుందం.

''ఆ సంగతి నాకెప్పుడో తెలుసు'' చల్లగా చెప్పాడు సుందరం.

—గొల్లమందల రాధాకృష్ణ (ఖమ్మం)